సాక్షి
మహబూబ్‌నగర్
సోమవారం ၊ 26 ၊ మే ၊ 2025



శిక్షణ అదుర్స్

వేసవి సెలవుల్లో విద్యార్థులకు వివిధ కళలపై మక్కువ పెంచేలా శిక్షణ ఇస్తున్నారు.

వివరాలు 8లో ▸



భూ పట్టాలు ఇవ్వాలి

గిరిజనులకు వెంటనే భూ పట్టాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.3 /21.9

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ జట్టు ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో వచ్చే నెల 1న జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అండర్– 8, 10, 12 ఏళ్లలోపు బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలను సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఎస్సెస్సీ మెమో, తహసీల్దార్ ద్వారా కుల, జనన ధ్రువ పత్రాలతో రిపోర్ట్ చేయాలని సూచించారు.

నేడు లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): భూ భారతి చట్టం అమలులో భాగంగా నియమించనున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లకు సోమవారం జిల్లా పరిషత్ హాల్‌లో శిక్షణ నిర్వహించనున్నట్లు సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమాన్ని కలెక్టర్ విజయేందిర ప్రారంభిస్తారన్నారు. సర్వేయర్లు సకాలంలో హాజరు కావాలని ఆయన సూచించారు.

ఇంట్రా టూడే లీగ్‌లో రాణించాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: ఇంట్రా డిస్ట్రిక్ట్ టూడే లీగ్‌లో క్రీడాకారులు ప్రతిభచాటాలని ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రం సమీపంలోని సమర్థ స్కూల్ మైదానంలో అండర్–23 పురుషుల ఇంట్రా డిస్ట్రిక్ట్ టూడే లీగ్‌లో భాగంగా ఆదివారం మహబూబ్‌నగర్– నాగర్‌కర్నూల్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ క్రీడా జట్లను పరిచయం చేసుకొని మాట్లాడుతూ ఇంట్రా డిస్ట్రిక్ల్ లీగ్ క్రీడాకారులకు మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్‌లకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. జట్లకు ఎంపికైన ప్రతి క్రీడాకారుడికి మ్యాచ్‌లు ఆడే అవకాశం లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని తమ వ్యక్తిగత ప్రదర్శనను చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్‌లో రాణించే క్రీడాకారులకు త్వరలో జరిగే హెచ్‌సీఏ టోర్నమెంట్‌లో పాల్గొనే ఎండీసీఏ జట్లకు ఎంపిక చేస్తామన్నారు. ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్‌లు ప్రారంభించిన హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు అబ్దుల్లా, ఎండీ మన్నాన్, సీనియర్ క్రీడాకారుడు ఆబెద్ హుస్సేన్ పాల్గొన్నారు.

లీగ్ మ్యాచ్‌కు వర్షం అడ్డంకి

సమర్థ స్కూల్ మైదానంలో మహబూబ్‌నగర్–నాగర్‌కర్నూల్ జట్ల మధ్య టూడే లీగ్ మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన నాగర్‌కర్నూల్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 37.5 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌట్ అయిది. జట్టులో కేతేశ్వర్ 65 పరుగులు చేశాడు. మహబూబ్‌నగర్ బౌలర్లు కొండ శ్రీకాంత్ 9.5 ఓవర్లలో 33 పరుగులకు 4 వికెట్లు, మహ్మద్ షాదాబ్ అహ్మద్ 12 ఓవర్లలో 33 పరుగులకు 4 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టుకు పలుమార్లు వర్షం అడ్డంకిగా మారింది. 22 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేయగా వర్షం వల్ల మ్యాచ్‌ను నిలిపివేశారు. ఓపెనర్ ఎ.శ్రీకాంత్ 72 బంతుల్లో 11 ఫోర్లతో 65 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. సోమవారం రెండో రోజు మ్యాచ్ కొనసాగనుంది.

ఉగ్రవాద నిర్మూలనే లక్ష్యం

మరికల్: ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం పనిచేస్తుందని, ఈక్రమంలోనే సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం వల్లే వంద మందికి పైగా ఉగ్రవాదులను హతమార్చడం జరిగిందని ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆమె మరికల్‌లో వీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పహల్గాం దాడి తర్వాత పాకిస్తాన్‌లో దాక్కున్న ఉగ్రవాదుల స్థావరాలపై ప్రతీకార దాడి చేసి విజయం సాధించమన్నారు. సైనికుల విజయానికి మద్దతుగా తీరంగా యాత్ర నిర్వహించామని, ఇందుకు దేశ ప్రజల నుంచి కూడా సంపూర్ణ మద్దతు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. భవిష్యత్‌లో భారతదేశంపై ఎక్కడ దాడి జరిగినా ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచివేయడం కోసం చేపట్టి ఆపరేషన్ సిందూర్ కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, నాగురావు, రతంగపాండురెడ్డి, నర్సన్‌గౌడ్, వేణు, తిరుపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజేష్, శ్రీరామ్, రమేష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బీజీ-3 కలకలం..

జిల్లావ్యాప్తంగా నిషేధిత పత్తి విత్తనాల విక్రయాలు

- ఏపీ, గుజరాత్ రాష్ట్రాల నుంచి పెద్దమొత్తంలో దిగుమతి
- గ్రామాల్లో గుట్టుగా రైతులకు విక్రయాలు
- తాజా దాడులతో భారీగా పట్టివేత
- ఆలస్యంగా మేల్కొన్న వ్యవసాయాధికారులు



జడ్చర్ల: వానాకాలం (ఖరీఫ్) సీజన్ ఆరంభమవుతున్న వేళ బీజీ-3 నిషేధిత పత్తి విత్తనాల విక్రయాలు కలవరపెడుతున్నాయి. సీజన్ ప్రారంభానికి ముందే గ్రామీణ ప్రాంతాల్లో నకిలీ విత్తన వ్యాపారులు చాపకింద నీరులా అల్లుకుపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ముందస్తుగా దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు విత్తనాల కోసం వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే వ్యాపారులు వారికి ఎక్కువ మొత్తంలో కమీషన్ ఇచ్చే కంపెనీలు సరఫరా చేసే నాసిరకం విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. ఈ ఏడాది విత్తనాల లేవంటూ కృత్రిమ కొరత సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారు.

అత్యంత ప్రమాదకరం

బీజీ–3 విత్తనాలు అత్యంత ప్రమాదకరం కావడంతో ప్రభుత్వం నిషేధించింది. నాణ్యత లేని లూజ్ విత్తనాలను రైతులకు విక్రయించడం తగదు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నాం. బీజీ–3 పత్తి విత్తన విక్రయాలపై గట్టి నిఘా పెట్టాం. బీజీ–3 విత్తనాల సాగు, దుష్ప్రభావాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. విత్తనాలు లైసెన్స్ ఉన్న డీలర్ల దగ్గరే కొనుగోలు చేసి బిల్లులు తీసుకునేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. నకిలీ విత్తనాలను ఎక్కడైనా విక్రయిస్తే చర్యలు తప్పవు. పత్తి పంట ఆకులను పరీక్షించి బీజీ–3 విత్తనాలు సాగు చేసిన రైతులపై చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్, జిల్లా వ్యవసాయాధికారి

విత్తనమే మూలం..

రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే ప్రాథమిక స్థాయిలో విత్తన ఎంపిక కీలకం. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని సాగు చేస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చు. జన్యు, భౌతిక స్వచ్ఛత కలిగిన విత్తనాలను ఎంపిక చేసుకోవడం మంచిదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భౌతిక స్వచ్ఛతకు సంబంధించి గింజ పరిమాణం, రంగు వంటివి గమనించి విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. నాసిరకం విత్తనాలను ఎంపిక చేసుకోవడం వలన తెగుళ్ల బెడదతోపాటు పంట గిడసబారి దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అంతేగాక పంట సస్యరక్షణకు మందులను అధిక మొత్తంలో వాడటం వలన రైతులపై ఆర్థిక భారం పడుతుంది.

ప్రధాన వాణిజ్య పంట

ప్రతిఏటా వానాకాలం సీజన్‌లో ప్రధాన వాణిజ్య పంటగా పేరొందిన పత్తిని అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. ఈ ఏడాది సైతం జిల్లాలో దాదాపు లక్ష ఎకరాలకుపైగా పత్తిని సాగు చేయవచ్చన్న అంచనాలు ఉన్నాయి. ప్రభుత్వం కూడా ఎక్కువగా పత్తి పంట సాగుకే ప్రాధాన్యత కల్పించడంతో రైతులు సైతం ఆసక్తి చూపుతున్నారు. పత్తి తర్వాత వరి, మొక్కజొన్న, ఆముదం, వేరుశనగ, పెసర, కంది తదితర పంటలను సాగు చేస్తారు. అయితే ఇప్పటికే వర్షాలు కురుస్తుండటంతో కొందరు రైతులు ముందస్తుగా పంట సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. వీరంతా ఈపాటికే విత్తనాలు కొనుగోలు చేసి పెట్టుకున్నారు. అధికారులేమో ఇప్పుడు నకిలీ విత్తనాల కట్టడికి చర్యలు చేపడుతున్నారు.



జడ్చర్లలో పట్టుబడిన బీజీ-3 పత్తి విత్తనాలు, నిందితులతో పోలీస్, వ్యవసాయాధికారులు (ఫైల్)

బ్రాండ్ల పేర్లు ముద్రించి..



రంగులద్ది తయారు చేసిన నకిలీ పత్తి విత్తనాలు(ఫైల్)

నాసిరకం విత్తనాలు రైతాంగాన్ని వెంటాడుతున్నాయి. గతంలో అనేక సార్లు లూజు విత్తనాలను తీసుకువచ్చి వాటికి రంగులద్ది వివిధ బ్రాండ్ల పేర్లతో ముద్రించిన కవర్లలో ఆయా విత్తనాలను నింపి రైతులకు అంటగట్టేవారు. ఈ క్రమంలోనే పలుమార్లు నకిలీ విత్తనాలు, వాటికి సంబంధించిన కవర్లు అనేకం జడ్చర్లలో పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. పత్తి విత్తన కంపెనీలు కలిగిన భూత్పూర్‌లో సైతం అధికారులు పలుమార్లు సోదాలు చేసి నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనపర్చుకున్నారు.

భారీగా పట్టివేత..

ప్రభుత్వం బీజీ -3 పత్తి విత్తనాల కట్టడికి ఎంతగా చర్యలు చేపడుతున్నా బహిరంగ మార్కెట్‌లోకి మాత్రం విచ్చలవిడిగా నిషేధిత విత్తనాలు వస్తున్నాయి. గతేడాది జడ్చర్ల మండలంలోని గోప్లాపూర్‌లో ఇద్దరు వ్యక్తుల దగ్గర 2.21 క్వింటాళ్ల బీజీ-3 పత్తి విత్తనాలు పట్టుబడగా తాజాగా ఇదే గ్రామంలో మళ్లీ దొరికాయి. అలాగే సమీపంలోని ఈర్లపల్లి తండాలోనూ ఇద్దరు వ్యక్తుల వద్ద బీజీ-3 పత్తి విత్తనాలు పట్టుబడటం గమనార్హం. నాలుగేళ్ల క్రితం ఏకంగా జడ్చర్లలోనే ఓ పత్తి విత్తన వ్యాపారి నకిలీ విత్తనాలను తయారు చేసి విక్రయిస్తుండగా అప్పట్లో విజిలెన్స్ అధికారులు పట్టుకున్న విషయం తెలిసిందే.

తక్కువ ధరకు విక్రయం..

కొందరు రైతులు ప్రభుత్వం నిషేధించిన బీజీ–3 పత్తి విత్తనాలను గుట్టుగా సాగు చేస్తున్నారు. ప్రభుత్వ ఆమోదం లేని బీజీ–3 (హెచ్‌టీ) పత్తి విత్తనాలను సైతం కొందరు వ్యాపారులు లోగుట్టుగా విక్రయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు, మాచర్ల తదితర ప్రాంతాల నుంచి ఇప్పటికే లూజు పత్తి విత్తనాలు గ్రామాలకు చేరాయి. తక్కువ ధరకు (కిలో రూ.వెయ్యి నుంచి రూ.1,500) పత్తి విత్తనాలు అందజేస్తుండటంతో రైతులు వాటినే కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు బీటీ–1, 2 రకాలకు మాత్రమే ప్రభుత్వ అనుమతి ఉంది. కానీ, బీజీ–3 పత్తి విత్తనాలకు ఇవ్వలేదు. అయితే అంతగా అవగాహన లేని రైతులకు కొందరు వ్యాపారులు వీటిని అంటగడుతున్నారు.

ప్రశాంతంగా గ్రామ పాలనాధికారి పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయేందిర

- 152 మందికి 140 మంది హాజరు
- కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): గ్రామ పాలన అధికారి రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాకేంద్రంలోని చైతన్య హైస్కూల్‌లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయగా.. మొత్తం 152 మంది అభ్యర్థులకు గాను 140 మంది హాజరవగా.. 12 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కాగా 1.30 గంటల వరకు కొనసాగింది. గంట ముందు నుంచే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించారు. అలాగే అభ్యర్థులు ఎలాంటి ఎల్రక్టానిక్ పరికరాలు తీసుకురాకుండా పకడ్బందీగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ విజయేందిర తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించి, హాజరు వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ మోహన్‌రావు, డీఈఓ ప్రవీణ్, ఆర్‌డీఓ నవీన్, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మహమ్మద్ అహ్మద్, అర్బన్ డీటీ దేవేందర్ తదితరులున్నారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు 144 సెక్షన్ అమలు చేసి పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ప్రణాళికాబద్ధంగా పాలమూరు అభివృద్ధి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: విజన్–2047తో పాలమూరు అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి మహబూబ్‌నగర్‌ను కార్పొరేషన్‌గా మార్చామన్నారు. విజన్–2047 లక్ష్యంతో నిర్దిష్టమైన ప్రణాళికలతో మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి చేయడానికి నిపుణులు, కన్సల్టెంట్లు, సర్వేయర్లతో ఆలోచన చేస్తున్నామని, ముందుగా ప్రధాన సమస్యలను గుర్తించినట్లు చెప్పారు. నగరంలో ట్రాఫిక్ ప్రధాన సమస్యగా ఉందని, ఇందుకోసం బైపాస్ రోడ్డు అవసరమని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వివరించగా.. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. టీయూఐడీఎఫ్ ద్వారా మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీటి సరఫరా అభివృద్ధి కోసం రూ.220.94 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. భవిష్యత్‌లో భూత్పూర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్‌తో కలిపి ట్రైసిటీ నగరంగా మారుతుందన్నారు. ప్రస్తుత జనాభా 3 లక్షలు ఉందని, 2047 వరకు 5 లక్షల వరకు పెరుగవచ్చని, అప్పటి అవసరాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ చేపడుతున్నట్లు వివరించారు. కలలో కూడా ఊహించని విధంగా ప్రాజెక్టులు పాలమూరుకు వస్తున్నాయని, అందులో భాగంగా ఐఐఐటీ కళాశాల ఒకటి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మూలకుపడిన అమృత్ స్కీంలో కదలిక తెప్పించామన్నారు. మయూరీ ఎకో అర్బన్ పార్కును అభివృద్ధి చేస్తామని, త్వరలో పూలే- అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రానికి శంకుస్థాపన చేస్తామన్నారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, నాయకులు బెనహర్, కృష్ణయ్య, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్‌లో 11 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం రోజురోజుకూ అడుగంటుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. ఆదివారం సాయంత్రం వరకు 11 అడుగులకు చేరింది. వానాకాలం తర్వాత యాసంగి పంటలకు నీటిని వదిలే సమయంలో ప్రాజెక్టు నీటిమట్టం 31.6 అడుగులుగా ఉండగా గత నెలలో పంటలు పూర్తయ్యే నాటికి 13.3 అడుగులకు పడిపోయింది. యాసంగి పంటల సాగు పూర్తయిన తర్వాత ప్రాజెక్టులో ఉన్న మూడు పంప్‌హౌస్‌ల నుంచి పంపులను రన్ చేసి తాగునీటి అవసరాలకు సరఫరా చేస్తున్నారు. నారాయణపేట, కొడంగల్, కోస్గి, దేవరకద్ర, మరికల్, ధన్వాడ, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాలకు మిషన్ భగీరథ కింద తాగునీటిని అందిస్తున్నారు. దీంతో గత నెల రోజుల్లో 2.3 అడుగుల నీటిమట్టం తగ్గి 11 అడుగులకు చేరింది. జూన్ నెలలో వర్షాలు సమృద్ధిగా కురిస్తే పెద్దవాగు ద్వారా కోయిల్‌సాగర్‌కు నీరు చేరే అవకాశం ఉంది. అలాగే జూరాలకు వరదలు వస్తే కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం పంపులను రన్ చేసి ప్రాజెక్టుకు నీటిని తరలిస్తారు.



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు

వేసవిలో ‘ఉపాధి’

ఎండాకాలం నేపథ్యంలో భారీగా కూలీల హాజరు

- ప్రభుత్వం నిర్దేశించిన సగటు వేతనం రోజుకు రూ.307
- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో దక్కేది రూ.216లోపే
- కొలతలు, పనిగంటల ప్రకారమే వేతనం చెల్లింపు
- అవగాహన కల్పించడం, అమలులో అధికారుల ఉదాసీనత

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి జిల్లాలో మూడు నెలలుగా ఉపాధి హామీ కూలీల హాజరు భారీగా నమోదవుతోంది. వేసవికాలంలో ఉపాధి పనులే వేల మందికి ఆసరాగా నిలుస్తున్నాయి. సాధారణ రోజుల్లో వ్యవసాయ, ఇతర పంటలకు ఎక్కువగా మొగ్గుచూపుతుండగా.. వేసవిలో ఎక్కువగా ఉపాధి హామీ పనులకు కూలీలు ఆసక్తి చూపుతున్నారు. క్రమంగా వేసవిలో రెట్టింపు స్థాయిలో కూలీల హాజరు నమోదవుతోంది. అయితే కేంద్ర ప్రభుత్వం సగటు ఉపాధి హామీ కూలీ దినసరి వేతనం రూ.307గా నిర్ణయించింది. ఈ మేరకు నిర్దేశిత కొలతల ప్రకారం అధికారులు కల్పించిన పనులు నిర్వహిస్తే కూలీలకు ఈ మొత్తం దక్కాలి. కానీ, ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో రోజు కూలీ రూ.250 మించడం లేదు.



నవాబుపేట మండలం హాజిలాపూర్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

జిల్లాల వారీగా ఉపాధి హామీ పథకం వివరాలు

జిల్లా	మొత్తం కూలీలు	కూలికి హాజరైన వారు	సగటు వేతనం (రూ.లలో..)
మహబూబ్‌నగర్	2,22,421	52,399	215
నాగర్‌కర్నూల్	3,74,896	55,809	216
వనపర్తి	2,37,752	43,205	290
జోగుళాంబ గద్వాల	3,35,468	40,206	275
నారాయణపేట	2,01,169	40,474	244

అవగాహన కరువు..

ఉపాధి హామీ పథకం 2005లో ప్రారంభం కాగా, అప్పుడు దినసరి వేతనం రూ.87.50గా ఉండేది. ప్రస్తుతం ఈ రేటు రోజుకు రూ.307 వరకు ప్రభుత్వం పెంచింది. నిర్దేశిత కొలతలు, కేటాయించిన పనిగంటల ప్రకారం కూలీలు పనులు చేపడితే వారికి రూ.307 దినసరి వేతనంగా వారి కూలీల ఖాతాల్లో జమచేయాల్సి ఉంటుంది. కానీ, ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలో ఎక్కడా రూ.250 దాటడం లేదు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో తక్కువగా రోజుకు రూ.216 చొప్పున మాత్రమే కూలీలకు దక్కుతోంది. ఈ మొత్తం జిల్లావ్యాప్తంగా సగటు వేతనంగా లెక్క తీస్తుండగా.. చాలాచోట్ల కూలీలకు రూ.150 కూడా రావడం లేదని చెబుతున్నారు. నిర్దేశిత కొలతలు, నిబంధనల ప్రకారం కూలీలు పనులు చేపడితేనే గరిష్ట మొత్తం దినసరి వేతనంగా తీసుకునే వీలుండగా, ఈ విషయంలో కూలీలకు సరైన అవగాహన కల్పించడం లేదు. చాలాచోట్ల నామమాత్రంగా ఉపాధి పనులు చేపడుతున్నారు. ఎక్కువగా పనిదినాలు కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు తప్ప గరిష్టంగా దినసరి కూలీ వచ్చేలా చూడటం లేదని తెలుస్తోంది. దీంతో కూలీలు ఎక్కువ రోజులు పనిచేసినా, తక్కువ మొత్తమే చేతికి వస్తుండటంతో ఉపాధి పనులపై నిరాశ చెందుతున్నారు.

ఇతర పనులు లేకపోవడంతో..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కువ మంది జాబ్‌కార్డుదారులు వ్యవసాయ పనులకు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. ఉపాధి హామీ కూలీ కన్నా వ్యవసాయ పనులకు, ఇతర కూలీ పనులకు ఎక్కువ వేతనం వస్తుండటంతో ఆయా పనులకే ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఒక్కో జిల్లాలో ఉపాధి పనుల కోసం నిత్యం 20 వేలకు మించి కూలీల హాజరు నమోదు కావడం లేదు. కానీ వేసవిలో వ్యవసాయ పనులు పెద్దగా లేకపోవడంతో ఎక్కువ శాతం కూలీలు ఉపాధి హామీ పనులకు మొగ్గు చూపుతున్నారు. దీంతో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ప్రతి జిల్లాలో రోజుకు 50 వేల వరకు ఉపాధి కూలీలు హాజరవుతున్నారు. వీరందరికీ కూలీ కల్పించలేక చాలాచోట్ల రొటేషన్ పద్ధతిలో సర్దుబాటు చేస్తూ కూలీలకు పనులు చేపడుతున్నారు. దీంతో వంద రోజుల లక్ష్యం బదులు కూలీలకు సగం పనిదినాలే లభిస్తున్నాయి.

రూ.250 దాటడం లేదు..



ఎంత పనిచేసినా రూ.250 కూలి దాటడం లేదు. ప్రభుత్వం రూ.300 ఇస్తామంటున్న ఇక్కడ మాత్రం అలా వస్తలేదు. ఎండలకు భూమి చాలా గట్టిగా ఉండటంతో ఎంత చేసినా పని సాగక తక్కువే వస్తుంది. అసలే కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి పని చేస్తున్నాం. ప్రభుత్వం తాము చేసిన కూలీ పనికి అదనంగా కలిపి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– జగత్యానాయక్,
పున్యానాయక్‌తండా, నవాబుపేట

పది రోజులుగా పనిలేదు..



నేను ఎండాకాలంలో ఉపాధి హామీ పనులకు వెళ్లాను. రోజుకు రూ.260 చొప్పున డబ్బులు పడ్డాయి. కానీ, పది రోజులుగా గ్రామంలో ఉపాధి పనులు పెట్టడం లేదు. ఏ పని లేక ఖాళీగా ఇంటి వద్దే ఉంటున్నాం. రోజూ పని కల్పిస్తే మాకు ఉపయోగంగా ఉంటుంది.

– లక్ష్మీదేవమ్మ,
మంచాలకట్ట, పెంట్లవెల్లి మండలం

పూర్తిస్థాయిలో చేస్తేనే గరిష్ట కూలి

ఉపాధి హామీ పథకంలో భాగంగా అన్ని గ్రామాల్లో కూలీలకు పనులు కల్పిస్తున్నాం. నిర్దేశిత కొలతలు, పని గంటల ప్రకారం పనిచేస్తేనే గరిష్టంగా కూలి వచ్చేందుకు వీలుంటుంది. ఈ విషయంలో కూలీలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. కూలీలకు గరిష్టంగా దినసరి వేతనం వచ్చేలా కృషి చేస్తాం.

– ఓబులేషు, డీఆర్‌డీఓ, నాగర్‌కర్నూల్

క్లుప్తంగా

వాగులో పడి మహిళ మృతి

మదనాపురం: ప్రమాదవశాత్తు వాగులో పడి మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల మేరకు.. చిన్న చింతకుంట మండలం అల్లిపూర్‌కు చెందిన బోయ సీతమ్మ (62) కూలి పనులు చేసుకుంటూ జీవించేది. శుక్రవారం సాయంత్రం మదనాపురం మండలం దుప్పల్లిలో ఉన్న అక్క వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గ్రామ శివారులో ఉన్న ఊక చెట్టు వాగులో పడి మరణించింది. అన్న బోయ వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత బలవన్మరణం

శాంతినగర్: కుటుంబంలో నెలకొన్న ఆర్థిక సమస్యతో మనస్తాపానికి గురైన ఓ వివాహిత ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని తనగలకు చెందిన ప్రసన్నకుమార్‌కు కర్నూలు జిల్లా ప్యాలకుర్తికి చెందిన సునీల(25)తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ అనంతరం సునీల తల్లి ఎర్రక్కకు భర్త ప్రసన్నకుమార్ రూ.లక్ష అప్పుగా ఇచ్చాడు. ఆ తర్వాత రూ.50 వేలు తిరిగి ఇవ్వగా.. మరో రూ.50 వేలు ఇవ్వాల్సి ఉంది. అయితే డబ్బుల వసూల విషయమై భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో మనస్తాపానికి గురైన సునీల ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై సునీల తల్లి ఫిర్యాదు మేరకు భర్త, అత్తామామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సునీలకు భర్తతోపాటు 5 నెలల బాలుడు శశ్విక్ ఉన్నాడు.

అడ్డొచ్చిన కుక్క.. మహిళ మృతి

మక్తల్: బైకుపై వెళ్తున్న సమయంలో కుక్క అడ్డురావడంతో కిందపడి ఓ మహిళ మృతి చెందగా మరొకరికి గాయాలైన ఘటన మక్తల్ పట్టణంలో ఆదివారం జరిగింది. కృష్ణ మండలం గుడేబల్లూర్ గ్రామానికి చెందిన పార్వతమ్మ (43) తమ్ముడు తిమ్మప్ప (30)తో కలిసి మక్తల్‌కు బయలుదేరారు. శుభకార్యం అనంతరం తిరుగు ప్రయాణంలో బైక్‌కు కుక్క అడ్డొచ్చింది. దీంతో ఇద్దరు కిందపడ్డారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా పార్వతమ్మ తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స పొందుతూ మరణించింది. తిమ్మప్పకు చికిత్స అందిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మీ రెడ్డి తెలిపారు.

చోరీ కేసులో నలుగురికి రిమాండ్

తిమ్మాజిపేట: ఇటీవల తిమ్మాజిపేటలో జరిగిన చోరీ కేసులో నలుగురు యువకులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. పట్టణంలో రామ్‌లాల్ అనే వ్యక్తి టీ స్టాల్ నిర్వహిస్తున్నారు. అయితే ఈనెల 3న దుకాణం తాళం పగులగొట్టి యువకులు సిగరెట్ డబ్బాలను దొంగతనం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నలుగురు దొంగ తనానికి పాల్పడినట్లు తేల్చి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం నలుగురిని అరెస్ట్ చేసి కల్వకుర్తి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

శిక్షణ అదుర్స్



అమరచింత పాఠశాలలో ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

- వేసవి సెలవుల్లో విద్యార్థులకు పలు అంశాలపై తర్ఫీదు
- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శిబిరాల నిర్వహణ
- ఒక్కొక్క క్యాంపులో 250 మంది విద్యార్థులు
- చదువుతో పాటు క్రమశిక్షణ, సంస్కారం పెంపునకు కృషి

అమరచింత: వేసవి సెలవుల్లో విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసకాకుండా చదువుపై దృష్టి సారించడంతో పాటు వివిధ కళలపై మక్కువ పెంచేందుకు.. క్రమశిక్షణ, సంస్కారం, దేశభక్తి పెంపొందించేందుకు స్వచ్ఛంద సంస్థలు నడుం బిగించాయి. అందులో భాగంగా వేసవిలో వందేమాతరం ఫౌండేషన్, మై విలేజ్ మోడల్ విలేజ్ ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీలు సంయుక్తంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాయి. నెలరోజులుగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తూ.. విద్యార్థుల్లో దేశభక్తితో పాటు తల్లిదండ్రులను గౌరవించడం, ప్రేమించడం వంటి మంచి అలవాట్లను నేర్పిస్తున్నాయి. మరోవైపు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి నైపుణ్యాలను పెంపొందిస్తున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా వలంటీర్లను నియమించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు వందేమాతరం ఫౌండేషన్ ద్వారా శిక్షణకు విద్యార్థులను ఎంపిక చేశారు. అమరచింతలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ పాఠశాలలో 250 మంది విద్యార్థులతో శిబిరం నిర్వహిస్తున్నారు. వీరికి వసతితో పాటు భోజన సదుపాయాన్ని డీఎంఆర్‌ఎం ట్రస్ట్ చైర్మన్ దేశాయి ప్రకాశ్ రెడ్డి కల్పించారు. ఇక్కడ గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాల నుంచి విద్యార్థులు హాజరై తర్ఫీదు పొందుతున్నారు.

కాగితాలతో వస్తువుల తయారీ..



వాడిన కాగితాలను వృథాగా పారవేయకుండా అందమైన అలంకరణ వస్తువులు ఎలా తయారు చేయాలనే విషయాలను నేర్చుకున్నా. వాటితో ప్రకృతి, పర్యావరణంపై సందేశం ఇచ్చే బొమ్మలు తయారు చేశా. వాటికి ఎలాంటి రంగులు వేయాలో తెలుసుకున్నా.

– అమృత, విద్యార్థిని, చింతరెడ్డిపల్లె

చిత్రలేఖనంలో పట్టు..



చిత్రలేఖనం అంటే చాలా ఇష్టం. తక్కువ సమయంలో గణితం అంకెలు, అక్షరాలతో బొమ్మలు ఎలా వేయాలో నేర్చుకున్నా. మనసులోని ఆనందం, దుఃఖం, సంతోషం, ఆహ్లాదకరమైన ఆలోచనలు కలిగితే చిత్రాలు వేయవచ్చని ఇక్కడి డ్రాయింగ్ టీచర్ ద్వారా తెలుసుకున్నా.

– అంకిత, విద్యార్థిని, వనపర్తి

పుస్తక పఠనంపై ఆసక్తి..



పుస్తకాలు చదవాలంటే ఇబ్బందిగా ఉండేది. అలాంటిది క్యాంపులో చేరిన తర్వాత ఇక్కడి వలంటీర్లు నేర్పించిన మెళకువలతో పుస్తక పఠనంపై నెమ్మదిగా ఆసక్తి కలిగింది. రోజువారీ నీతి పుస్తకాలను చదవడం వల్ల పుస్తక పఠనంపై నాకు మరింత ఆసక్తి పెరిగింది.

– జీవిత, విద్యార్థిని, పొంరెడ్డిపల్లె

గణితంపై ఇష్టం పెరిగింది..



గణితం అంటే భయం ఉండేది. పదో తరగతిలో ఎలా అధిగమించాలని భయపడేదాన్ని. వేసవి శిక్షణ శిబిరానికి హాజరు కావడంతో మల్టీప్లికేషన్, ఆడిషన్స్ ఎలా చేయాలో నేర్చుకున్నాను. గణితంలో గుర్తుంచుకోవాల్సిన సూత్రాలను తెలుసుకున్నా. ఇక గణితం అంటే భయం పోయింది.

– భవ్యశ్రీ, విద్యార్థిని, అమరచింత

అందమైన చేతిరాత..



విద్యలో ప్రావీణం సాధించాలంటే చేతిరాత, చదవడం అవసరం. చక్కగా చదవడంతో పాటు రాయడం అవసరమని శిక్షణలో నేర్చుకున్నా. ఆంగ్లంపై భయం తొలగించుకుని ఇష్టం కలిగించేందుకు రీడింగ్ ప్రోగ్రాంలో సాధన చేస్తున్నా, బాలసభతో స్టేజీ ఫియర్ పోగొట్టుకున్నా.

– రాంచరణ్, విద్యార్థి, నర్వ

సంస్కారంతో కూడిన విద్య అవసరం..



విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం, దేశభక్తి పెంపొందించే విధంగా వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. 3నుంచి 9వ తరగతి చదివే విద్యార్థుల వరకు శిబిరంలో చేర్చుకుని వారికి చదువుతో పాటు వివిధ కళల నైపుణ్యాల గురించి శిక్షణ ఇస్తున్నాం. మొత్తం 16 శిక్షణ శిబిరాల్లో 3వేల మంది విద్యార్థులకు 96 మంది వలంటీర్లచే తరగతులను నిర్వహిస్తున్నాం. నెల రోజులపాటు విద్యార్థులకు ఇంటి పనులతో పాటు స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పిస్తున్నాం. తల్లితండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించే విధంగా వారిలో ప్రేరణ కలిగిస్తున్నాం.

– మాధవరెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

గిరిజనులకు భూ పట్టాలు ఇవ్వాలి



షాపురం రెవెన్యూ శివారులో గిరిజనులు సాగుచేస్తున్న భూములను పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

- జాగిర్దార్ల పేరుపై ఉన్న వాటిని రద్దు చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఖిల్లాఘనపురం: జాగిర్దార్ల పేరున ఉన్న భూ పట్టాలను రద్దుచేసి.. ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న గిరిజనులకు వెంటనే భూ పట్టాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలోని మామిడిమాడ, షాపురం గ్రామాల రెవెన్యూ శివారుల్లో గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కొంతకాలంగా భూ పట్టాల సాధన కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నారు. వారి పోరాటానికి మద్దతుగా జాన్‌వెస్లీ ఆదివారం మండలంలో పర్యటించారు. భూములు సాగు చేసుకుంటున్న వెనకితండా, ముందరితండా, బక్కతండా, మేడిబావితండా, కర్నెతండా, ఆముదంబండ తండా, మిట్యాతండా, భీముడితండా గిరిజనులతో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట అంజనేయులుతో కలిసి భూములను పరిశీలించారు. వెనకితండా, కర్నెతండాల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన గిరిజనులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆయా తండాల గిరిజనులు సుమారు 150 ఏళ్లుగా భూములను సాగుచేసుకుంటుండగా, ఇప్పటికీ రాజా శ్యాంకరణ్ బహదూర్, రాజా మోహన్ కరణ్ బహదూర్‌ల పేర్ల మీద భూ పట్టాలు ఉండటం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు మారినా, ఎన్నో చట్టాలు వచ్చినా గిరిజనులకు పట్టాలు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రాజులు గాని వారి వారసులు గాని, వారి పాలేర్లు గాని ఏనాడు ఇక్కడికి వచ్చి సాగుచేసింది లేదన్నారు. షాద్‌నగర్ జమీందారులైన నాటి రాజుల పేరున నేటికీ 495.7 ఎకరాల భూమి పట్టా ఉందన్నారు. దున్నేవాడికే భూ పట్టాలు ఇవ్వాలని సీలింగ్ యాక్ట్ వచ్చినా ఈ భూములు గిరిజనుల పేరున మారలేదన్నారు. జాగిర్దార్లకు సానుకూలంగా ప్రభుత్వాలు, అధికారులు వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పేద గిరిజనుల బాధను అర్థం చేసుకొని వారు సాగుచేస్తున్న భూముల ప్రకారం పట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎర్రజెండా నీడలో పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో భూ పట్టాల సాధన కమిటీ కన్వీనర్ సక్రూ నాయక్, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్యానాయక్, మహిళా సంఘం కార్యదర్శి లక్ష్మి, పరమేశ్వరాచారి, నాయకులు మద్దిలేటి, గిరిజన రైతులు కృష్ణానాయక్, భరత్ నాయక్, శ్రీను నాయక్, దాసు నాయక్, చంద్రు, రాజీ, మన్నీ, చాప్లీ, శిరీష పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

ధరూరు/ రాజోళి/ దోమలపెంట: ఉమ్మడి జిల్లా పరిధిలోని కృష్ణానదిపై నిర్మించిన జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతుంది. ఈ క్రమంలో ఆదివారం ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3,064 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చిందని అధికారులు తెలిపారు. అయితే స్థానికంగా కురుస్తున్న వర్షాల ఆధారంగా వస్తున్న ఇన్‌ఫ్లోలు ఆదివారం స్వల్పంగా తగ్గినట్లు వారు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.271 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం ఇలా..

రెండు గేట్ల ద్వారా నీటి విడుదల

సుంకేసుల డ్యాంలో రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఆదివారం ఎగువ నుంచి 4,462 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. రెండు గేట్లను తెరిచి అంతే స్థాయిలో దిగువన ఉన్న శ్రీశైలానికి వదిలారు. అలాగే కేసీ కెనాల్‌కు 159 క్యూసెక్కుల నీటిని వదిలినట్లు ఆయన పేర్కొన్నారు.

శ్రీశైలానికి 8,841 క్యూసెక్కులు

శ్రీశైలం జలాశయానికి సుంకేసుల డ్యాం నుంచి ఆదివారం 8,841 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తుంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 818.2 అడుగుల వద్ద 39.4936 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇదిలా ఉండగా.. గత 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 3.366 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసి దిగువనున్న నాగార్జునసాగర్‌కు 7,259 క్యూసెక్కుల నీటిని వదిలారు. స్థానికంగా 2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

గుప్తనిధుల కోసం తవ్వకాలు



గుడిబండ శివాలయం వద్ద చెట్ల పొదల్లో దుండగుల విడిచి వెళ్లిన తవ్వక సామగ్రి

- సంఘటన స్థలంలో సామగ్రి, పూజ వస్తువులు
- గుడిబండ శివాలయంలో తరచూ గుప్తనిధుల వేట

బల్మూర్: మండలంలోని కొండనాగుల గ్రామ సమీపంలోని గుడిబండ శివాలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు తరచూ జరుగుతున్నా పోలీసులు దుండగులను పట్టుకోలేక పోతున్నారని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి దుండగులు తవ్వకాలు జరిపి అలికిడి కావడంతో సామగ్రి అక్కడే వదిలి పారిపోయిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. శివాలయం ఎదురుగా ఉన్న చెట్ల పొదల్లో నాలుగు గడ్డపారలు, పారలు, సుత్తెలు, మాస్కులు, గ్లౌజ్‌లతో పాటు పూజ సామగ్రి ఉండటాన్ని పశువుల కాపరి గమనించి గ్రామస్తులకు తెలుపగా వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని తవ్వక సామగ్రిని స్టేషన్‌కు తరలించారు.

తరచూ తవ్వకాలు..

మూడేళ్లలో నాలుగుసార్లు గుప్త నిధుల కోసం గుడిబండ శివాలయంలో తవ్వకాలు జరిపారు. గత మూడు నెలల క్రితం గుర్తు తెలియని దుండగులు శివాలయంలోని బండను తొలగించి తవ్వకాలు జరిపారు. శివాలయం గ్రామానికి దూరంగా రెండు కిలోమీటర్ల దూరంలో వ్యవసాయ పొలాల్లో ఉండటంతో దుండగులు ఎలాంటి భయం లేకుండా తరచూ గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతూనే ఉన్నారు. గుడిలో భారీ ఎత్తున్న గుప్తనిధులు ఉన్నట్లు ప్రచారం ఉండటంతో వివిధ ప్రాంతాలకు చెందిన దుండగులు నిత్యం తవ్వకాలు జరుపుతున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. గుప్తనిధుల కోసం తవ్వకాలపై పోలీసులు నిఘా ఏర్పాటు చేసి దుండగులను పట్టుకొని శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రమాదేవి తెలిపారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత



తల్లిదండ్రులకు బాలికను అప్పగిస్తున్న పోలీసులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయినోనిపల్లి గ్రామానికి చెందిన మల్లమ్మ- భగవంతుడు దంపతుల కుమార్తె శివమ్మ ఆదివారం తప్పిపోయింది. అయితే తప్పిపోయిన బాలిక మండలంలోని చిన్న కార్పముల-పెద్దకార్పముల రోడ్డుపై ఓ వ్యక్తికి కనిపించడంతో అతడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీశ్ స్పందించి సిబ్బందిని పంపి పాప వివరాలు ఆరా తీశారు. బాలిక సమాచారం చెప్పకపోవడంతో గ్రామాల వారీగా వివరాలు తెలుసుకొని చిన్నకార్పముల గ్రామానికి చేరకొని ఎట్టకేలకు తల్లిదండ్రులకు అప్పగించారు.

సకుటుంబ.. సపరివార.. సమేతంగా



కొత్తకోటలో ఆదివారం అపూర్వ ఘట్టం చోటుచేసుకుంది. ఓ కుటుంబానికి చెందిన సుమారు 250 మంది ఒకేచోట ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి ఆటపాటలతో సరదాగా గడిపారు. కొత్తకోటకు చెందిన ఉపాధ్యాయుడు పలుస శేఖర్‌గౌడ్ ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో కుటుంబ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. సుమారు 250 మంది కుటుంబ సభ్యులు సమ్మేళనంలో పాల్గొని కుటుంబ ప్రాధాన్యతను తెలియజేశారు. మారుతున్న కుటుంబ బంధాలకు దూరమవుతున్న పిల్లలకు కుటుంబ విలువలను తెలియజేసేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు శేఖర్‌గౌడ్ తెలిపారు. అలాగే పెద్దల ఉపన్యాసాలతో కుటుంబ విలువలు, జీవన విధానం గురించి చక్కగా వివరించారు. అనంతరం యువత, చిన్నారులతోపాటు మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

– కొత్తకోట

హడలెత్తిస్తున్న చిరుతలు..!



ఫింజర్ గుట్టపై కనిపించిన చిరుత

- భయాందోళనలో ప్రజలు
- అడవులకు వెళ్లొద్దని సూచిస్తున్న అధికారులు

కోయిల్‌కొండ: మండలంలో వివిధ ప్రాంతాల్లో చిరుతల సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చిరుత పులులు అటవీ ప్రాంతాలను వదిలి సమీపంలో ఉన్న పంట చేల వైపు, కొండ ప్రాంతాల వైపు సంచరిస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు జంకుతున్నారు. మేతకు వెళ్లిన పశువులపై దాడి చేసి చంపేస్తుండడంతో ప్రజలు హడలిపోతున్నారు. ఐదేళ్లుగా మండలంలో చిరుతపులల సంచారం పెరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో 12పైగా చిరుతపులులు?

జిల్లాలో అటవీ ప్రాంతాలలో 12 నుంచి 15కు పైగా చిరుతపులులు సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో కోయిల్‌కొండ మండలంలో 5 నుంచి 6 వరకు చిరుత పులులు ఉన్నాయని, ఇవి ఒకే ప్రాంతంలో కాకుండా 40–70 కిలోమీటర్లు రోజు ప్రయాణం చేస్తుంటాయని అధికారులు తెలుపుతున్నారు. మండలంలో బూర్గుపల్లి, దమాయపల్లి, ఇబ్రహీంనగర్, భవానిసాగర్, కోయిల్‌కొండ, కనాయపల్లి, సూరారం, కేశ్వాపూర్ ప్రాంతాల్లో సంచరిస్తూ ప్రజల కంటపడ్డాయి. బూర్గుపల్లి, తిర్మలంపల్లి, పల్గుతాండ, కేశ్వాపూర్ గ్రామాలలో ఇప్పటికే అనేక పశువులను హతమార్చాయి. నెలకు ఒక్కసారైన పశువులపై దాడి చేసి చంపేసిన ఘటనలు వెలుగుచూస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో నీటి లభ్యత లేకపోవడంతో పాటు ఆహారం కోసం గ్రామాల్లోకి వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

భయాందోళనలో రైతులు

చిరుతలు తరచూ పంట చేలవైపు వస్తుండడంతో రైతులు, కూలీలు పనులకు వెళ్లేందుకు భయపడుతున్నారు. వానాకాలం ప్రారంభంకానుండడంతో సాగు పనులు ముమ్మరం కానున్నాయి. ఈ క్రమంలో పులుల సంచారంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. పశువులను మేపేందుకు వెళ్లాంటే కాపరులు హడలిపోతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో పంటచేలకు వెళ్లే రైతులు కూలీలు గుంపులు గుంపులుగా వెళ్తూ చీకటి పడకముందే ఇంటికి చేరుకుంటున్నారు.

పశువులపై దాడులు..

కోయిల్‌కొండ, ఇబ్రహీంనగర్‌లో వరుసగా లేగదూడ, మేక పిల్లలపై చిరుతపులి దాడి చేసింది. బూర్గుపల్లిలో నాలుగు గేదెలపై దాడి చేసేందుకు యత్నించగా గేదెలు తిరగబడడంతో చిరుత పులికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో అటవీశాఖ అధికారులు చిరుతపులికి జూపార్కులో చికిత్స చేయించగా నెల రోజుల తర్వాత మృతి చెందింది. అదే విధంగా పల్గుతండాకు చెందిన రైతు లేగదూడను, బూర్గుపల్లిలో మరో రైతు గేదెను, కేశ్వాపూర్‌లో ఎద్దును, చన్మన్‌పల్లిలో ఆవును ఇలా పలు గ్రామాల పరిసర ప్రాంతాల్లో పశువులపై దాడి చేసి చిరుతపులులు హతమార్చాయి. అంతేకాక వారం రోజులుగా మండల కేంద్రంలోని ఫింజర్‌గుట్టపై చిరుతపులి కనిపిస్తుండడంతో యువకులు ఫోటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వైరల్‌గా మారాయి.

చిరుతల కదలికలపై నిఘా...

మండలంలో చిరుతపులులు సంచరిస్తుండడంతో వాటి కదలికలపై నిఘా పెట్టాం. చిరుతపులుల దాడి చేసి హతమార్చిన పశువుల కళేబరాలతో పాటు వాటి పాదముద్రలను సేకరిస్తున్నాం. ఎటునుంచి ఎటువైపు వెళ్తున్నాయని తెలుసుకునేందుకు చర్యలు చేపట్టాం. అయినా రైతులు జాగ్రత్తగా ఉండాలి. చిరుతలను బంధించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. – సత్యనారాయణ, జిల్లా ఫారెస్ట్ అధికారి

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ గ్రామ శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌లను పట్టుకున్నట్లు ఎస్ఐ కురుమయ్య తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున చిట్యాల గ్రామం నుంచి రెండు ట్రాక్టర్‌లు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ట్రాక్టర్ యజమానులైన రామలింగన్న, బొజ్జన్నలపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వక్ఫ్ సవరణ చట్టం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం



సభలో చేతులు ఎత్తి సంఘీభావం తెలుపుతున్న నాయకులు, మతపెద్దలు

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టం దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆలిండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు అధ్యక్షుడు ఖాలిద్ సైఫుల్లా రహ్మాని, కర్ణాటక మాజీ ఎంపీ సీఎం ఇబ్రహీం, కోల్‌కత్తాకు చెందిన మౌలానా అబు తాలిబ్ రహెమాని అన్నారు. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి ఆలిండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు ఆధ్వర్యంలో వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా భారీ నిరసన సభ నిర్వహించారు. వేలాదిగా ముస్లింలు పాల్గొన్న ఈ సభలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొని మాట్లాడారు. వక్ఫ్ సవరణ చట్టం వల్ల ముస్లింలకు తీరని నష్టం జరుగుతుందని, వక్ఫ్ ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను కాజేయడానికి కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా ముస్లింలంతా ఏకమవుదామని పిలుపునిచ్చారు. వక్ఫ్ సవరణ చట్టానికి మద్దతు ఇచ్చిన నితీష్‌కుమార్, చంద్రబాబునాయుడులకు ముస్లింలు తగిన బుద్ధిచెప్పాలని కోరారు. ముస్లిం ప్రముఖులు నిసార్ హుస్సేన్, హమీద్‌ఖాన్, హుసాముద్దీన్, మతీనుద్దీన్ వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆలిండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు నిర్వహించే నిరసన కార్యక్రమాలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. సభలో ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్‌బలాల, కన్వీనర్ మౌలానా నయీం కౌసర్ రషాది, రజాక్ షాఖాద్రీ, మౌలానా ఖాజా ఫైజొద్దీన్, టీజీఎంఎఫ్‌సీ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, హాఫిజ్ ఇద్రీస్, అబ్దుల్ హాదీ, జాకీర్ అడ్వకేట్, జాబెర్ బిన్ సయీద్, అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.